క్లుప్తంగా

12వ రోజు అయ్యప్పలకు భిక్ష



భిక్షను స్వీకరిస్తున్న అయ్యప్ప స్వాములు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం అయ్యప్ప స్వామి ఆలయంలో మాలాధారణ స్వాములకు నిర్వహిస్తున్న భిక్ష కార్యక్రమం 12వ రోజుకు చేరింది. జంగారెడ్డిగూడేనికి చెందిన అట్లూరి రత్నాకర్, అన్నపూర్ణాదేవి (శ్రీదత్తసాయి సన్స్ స్పోర్ట్స్) భిక్ష కార్యక్రమానికి దాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ ప్రెసిడెంట్ చిన్ని వాసుస్వామి, కోశాధికారి కూన పార్వతి, గుంట్ల వెంకటేశ్వరరావు, కొర్లేపర కృష్ణారావు, నెక్కలపూడి సూర్యచంద్రరావు, ఆలయ మేనేజర్ గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

19న అయ్యప్పకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం హరిహరసుత అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి వారి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా ఈ నెల 19వ తేదీన ఆలయంలో విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. మండపారాధన, పుణ్యాహవచనం, రుద్రాభిషేకం, లక్ష్మీగణపతి హోమం, నీరాజనం, మంత్రపుష్పాలు, అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తామని తెలిపారు.

చెక్కల ర్యాంపునకు మరమ్మతులు



ఆలయ తూర్పురాజగోపురం వద్ద స్టీల్ రెయిలింగ్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలోని తూర్పురాజగోపురంలో ధ్వంసమైన చెక్కల ర్యాంపుకు, అలాగే దెబ్బతిన్న స్టీల్ రెయిలింగ్‌కు సోమవారం మరమ్మతులు చేశారు. సాక్షి దినపత్రికలో సోమవారం ‘చెక్కల ర్యాంపు ధ్వంసం.. దెబ్బతిన్న రెయిలింగ్’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఆలయ అధికారులు వెంటనే మరమ్మతులు చేయించారు. ఇంజనీరింగ్ విభాగ డీఈ సుధాకర్, సిబ్బంది ఈ పనులను పర్యవేక్షించారు. ఈ ర్యాంపు మరమ్మతులతో వీల్ చైర్లలో ఆలయంలోకి వెళ్లి వచ్చే దివ్యాంగులు, అలాగే నడిచి వెళ్లే భక్తులకు ఇక ఇబ్బందులు తొలగినట్టే.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ద్వారకాతిరుమల: అనారోగ్యాన్ని భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు మండలంలోని దేవినేనివారిగూడేనికి చెందిన జి.సోమయ్య(36) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ బాధలు భరించలేక ఆదివారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన సోమయ్యను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అట్టహాసంగా కుంతీదేవి ఊరేగింపు



ఊరేగింపులో శక్తి వేషధారణలు

ద్వారకాతిరుమల: క్షేత్ర పురవీదుల్లో సోమవారం కుంతీదేవి ఊరేగింపు అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా స్థానిక ఎస్సీ కాలనీలోని రామాలయం వద్ద అమ్మవారికి ఉత్సవ కమిటీ సభ్యులు విశేష పూజలు నిర్వహించి, కాలనీలో ఊరేగించారు. ఆ తరువాత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి, హారతులిచ్చారు. అనంతరం తీన్మార్ డప్పు వాయిద్యాలు, శక్తి వేషధారణలు, డీజే సందడ్ల నడుమ కుంతీదేవిని పుర వీదుల్లో ఘనంగా ఊరేగించారు. రాత్రి అమ్మవారి విగ్రహాన్ని స్థానిక నృసింహ సాగరంలో నిమజ్జనం చేశారు.

విర్డ్ ఆసుపత్రిలో రోబోటిక్ వైద్య సేవలు

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో ఆదివారం రోబోటిక్ ఆర్థో శస్త్రచికిత్సలు నిర్వహించినట్టు ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు సోమవారం తెలిపారు. ఈ శస్త్రచికిత్సలు చేసిన వైద్యులు కృష్ణ కిరణ్ తదితరులను చైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణ కిరణ్ మాట్లాడుతూ రోబోటిక్ టెక్నాలజీతో రోగికి మెరుగైన, ఖచ్చితమైన, రక్షణతో కూడిన శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు అవకాశం ఉందన్నారు. సర్జన్ ఆదేశాల మేరకు రోబో పని చేస్తుందని, ప్రస్తుతం వైద్య చికిత్సలు అందించడంలో రోబో కీలకంగా మారిందన్నారు. రోబో సాయంతో విర్డ్‌లో 5 గురికి ఆర్థో శస్త్ర చికిత్సలను విజయవంతంగా చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో విర్డ్ హాస్పిటల్ ట్రస్ట్ సభ్యులు వి.నారాయణమూర్తి, ఎస్‌వీఎస్ఎన్ నివృతరావు, దేవస్థానం ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ఆస్పత్రి వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, పీవీ నాగేంద్ర బాబు, సింధు, రమ్య, మహిత తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా నకిలీ మద్యం

- నకిలీ మద్యం కుంభకోణంపై సీబీఐ విచారణ చేయించాలి
- వైఎస్సార్ సీపీ నేతలు తెల్లం బాలరాజు, జెట్టి గురునాథరావు డిమాండ్



పోలవరం: ఎక్సైజ్ సీఐకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు



చింతలపూడి: సీఐకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పోలవరం రూరల్: కూటమి ప్రభుత్వ హయాంలో నకిలీ మద్యం విచ్చలవిడిగా దొరుకుతోందని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. నియోజకవర్గంలోని పోలవరం ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వద్ద నకిలీ మద్యంపై ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. నకిలీ మద్యంపై సీబీఐ విచారణ చేసి, నిజాలు నిగ్గు తేల్చాలని, నకిలీ మద్యం అరికట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని నినదించారు. ఎక్సైజ్ సీఐ కె.వీరబ్రహ్మానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం ఏరులై పారుతోందని షాపుల్లో విచ్చలవిడిగా అమ్మకాలు సాగుతున్నాయన్నారు. ఈ మద్యం సేవించడం వలన ఎంతో మంది అనారోగ్యం పాలవుతున్నారని, కొందరు ప్రాణాలు కూడా కోల్పోతున్నారన్నారు. చంద్రబాబు అనుయాయులు ఈ నకిలీ మద్యం తయారీ, సరఫరాలో భాగం పంచుకుంటున్నారన్నారు. గుడి, బడి తేడా లేకుండా షాపుల నిర్వహణతో పాటు బెల్టు షాపులు భారీగా సాగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ నకిలీ మద్యంపై విచారణ చేపట్టాలన్నారు. కూటమి ప్రభుత్వంలో సాగుతున్న నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీయడంతో చంద్రబాబు కపట నాటకాలాడుతున్నారన్నారు. సిట్ పెడుతున్నానని, కమిటీ వేస్తున్నానని హడావిడి చేస్తున్నారు. నకిలీ మద్యం తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. మద్యం షాపులు కేటాయింపులోనే అనేక అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, పోలవరం, జీలుగుమిల్లి మండల కన్వీనర్‌లు బుగ్గా మురళీకృష్ణ, చంద్రప్రసాద్‌లు, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, ఆరేటి సత్యనారాయణ, సయ్యద్‌బాజీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజాలు నిగ్గు తేల్చాలి

చింతలపూడి: నకిలీ మద్యం కుంభకోణంపై సీబీఐ విచారణ చేయించి, నిజాలను నిగ్గు తేల్చాలని వైఎస్సార్ సీపీ సిబిఐ విచారణ జరిపించాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు డిమాండ్ చేశారు. నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ముందు వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆందోళన చేశారు. జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు ఇంటి వద్ద నుంచి ర్యాలీగా ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలో ఎస్ బ్రాండ్ లిక్కర్‌ను నిషేధించాలని, కల్తీ మద్యం దోషులను శిక్షించాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ అశోక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఉదయం నుంచి భారీ వర్షం పడుతున్నా లెక్క చేయకుండా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు భారీ ఎత్తున ఆందోళనకు హాజరయ్యారు.

కుంభకోణం కప్పి పుచ్చేందుకే..

రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు మాట్లాడుతూ నకిలీ మద్యం కేసులో అధికార పార్టీకి చెందిన నేతలు ఆధారాలతో సహా దొరికిపోయారని, దీన్ని కప్పిపుచ్చుకునేందుకు చంద్రబాబు సర్కార్ ప్రతిపక్ష నేతలపై నిందలు మోపుతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వ హయాంలో నకిలీ మద్యం తయారీ కుటీర పరిశ్రమగా మారిందని ఆరోపించారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొప్పుల నాగేశ్వరరావు, జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి చిలుకూరి జ్ఞానారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఎ.సుబ్బారావు, గోలి చంద్రశేఖర్ రెడ్డి, ముసునూరి వెంకటేశ్వరరావు, ముప్పిడి శ్రీనివాసరావు, త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, రామకృష్ణ, అన్నపనేని శాంతారావు, ర్యాంకుల సత్యనారాయణ, ఓరుగంటి నాగేంద్ర కుమార్, కర్పూరం గుప్త, కె.చండీప్రియ, కొదమ జ్యోతి, టి.గిరిజ, ఎస్.కాంతారావు, ఇమ్మానియేలు, సొంగ సందీప్, మట్ట సురేష్, ఎలమంచిలి సత్యనారాయణ, ఆదం, మొరంపూడి సత్యనారాయణ, కె.అంజిరెడ్డి, ఎస్.సాగర్, యు.మోహన్‌రావు, బి.వెంకటేశ్వరరావు, వి.సోమేశ్వరరావు, కె.ధర్మరాజు, గురజాల సారథి, ఎం.గురుబ్రహ్మం, కాటూరి ఏలియా, ఎస్.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అడ్డుకుంటాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

పోలవరం రూరల్: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మండల నాయకులు, కార్యకర్తలతో కలిసి కోటి సంతకాల ప్రజా ఉద్యమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు వైద్య విద్యను చేరువ చేస్తే, కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, జెడ్పీటీసీ కలుం హేమకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆది కర్మయోగి అభియాన్ గ్రామ సభలు

జంగారెడ్డిగూడెం: ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమంలో రెండో దశ గ్రామ సభల నిర్వహణ కార్యక్రమం జిల్లాలో చురుగ్గా సాగుతుంది. గిరిజన గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి. ఆది కర్మయోగి అభియాన్‌లో గిరిజనులు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు అధికారులు సమర్పించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సోమవారం జంగారెడ్డిగూడెం మండలం పట్టిన్నపాలెం గ్రామంలోని ప్రజలను కలిసి రూ.6.17 కోట్లతో రోడ్లు, తాగునీరు, విద్యుత్, వంటి మౌలిక సదుపాయాలు, పింఛన్లు, గృహాల నిర్మాణం వంటి పనులపై రూపొందించిన గ్రామ విజన్ యాక్షన్ ప్లాన్ వివరాలను గ్రామ సభలో ప్రజలకు తెలియజేశారు. తొలిదశలో జిల్లాలోని 9 మండలాల్లోని 46 గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. రెండో దశలో 31 గిరిజన గ్రామాల అభివృద్ధిపై యాక్షన్ ప్లాన్‌లను రూపొందించి గ్రామ సభలో ప్రజలతో చర్చించి ఆమోదించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సీహెచ్ గోపాలకృష్ణ, మాస్టర్ ట్రైనర్లు కేవీవీఎస్ ప్రసాద్, ఎన్.పున్నర్వి, పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే రాధికా, సర్పంచ్ రత్నకుమారి, ఉపసర్పంచ్ ఎ.రాకేష్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

జంగారెడ్డిగూడెం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కూటమి ప్రభుత్వాన్ని ఏపీ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును సాధించుకున్నారన్నారు. ఉమ్మడి ఏపీలో 2007లో సంక్షేమ బోర్డు ఏర్పడిందన్నారు. ఈ బోర్డు పరిధిలో 36 రకాల వృత్తుల్లో సుమారు 36 లక్షల కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. సంక్షేమ బోర్డును నిలుపుదల చేశారని, దీని వలన కార్మికులు నష్టపోతున్నారని వెంటనే సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఏజెన్సీలో దంచికొట్టిన వాన

బుట్టాయగూడెం: నైరుతి రుతుపవనాల నిష్క్రమణ కారణంగా ఏజెన్సీ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం దంచికొట్టింది. భారీ వర్షం కారణంగా కొండవాగులు పొంగిపొర్లాయి. వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండలంలోని రెడ్డిగణపవరం సమీపంలోని జల్లేరు వాగు, కేఆర్ పురం ఐటీడీఏకు వెళ్లే రహదారి మార్గంలో వాగు పొంగి పొర్లడంతో సుమారు 3 గంటల పాటు రాకపోకలకు అంతరాయం కలిగింది. అత్యవసరంగా ఆఫీస్‌లకు వెళ్లవలసిన వారు ఎక్కడికక్కడ వాగు ప్రవాహం తగ్గే వరకూ నిలిచిపోయారు. అలాగే బుట్టాయగూడెం శివారు కొత్తపేట సమీపంలోని దేవుడి మాన్యంలో పిడుగుపాటుకు రైతు దిగమర్తి శ్రీనుకు చెందిన రెండు చూడి ఆవులు మృతి చెందాయి.

గ్రామాలు జలమయం



కొయ్యలగూడెం మండలం అంకాలగూడెం సీసీ రోడ్లపై ప్రవహిస్తున్న వరద నీరు.

కొయ్యలగూడెం: ఎడతెరిపి లేకుండా ఆరు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి మండల వ్యాప్తంగా గ్రామాలను వరద నీరు ముంచెత్తింది. సోమవారం తెల్లవారు జాము ఐదున్నర గంటల నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి కొయ్యలగూడెం నుంచి కన్నాపురం వెళ్లే రహదారి ముంపునకు గురైంది. కొయ్యలగూడెం మహాలక్ష్మి థియేటర్ వద్ద నుంచి అంకాలగూడెం గ్రామం వరకు రోడ్డు జలమయమైంది. నూతికుంట కాలువ ఉధృతి అంకాలగూడెం కొత్త దళిత వాడను ముంచెత్తింది. కన్నాపురం రోడ్డుపై నీరు అధికంగా ఉండటం వలన రాకపోకలకు అంతరయం ఏర్పడింది. అంకాలగూడెం శివాలయం దగ్గరలో ఉన్న నూతికుంట చెరువు నుంచి నీరు పంట కాలువలకు వెళ్లే కాలువ పూడికలు తీయకపోవడంతో నీరు పొలాల పైనుంచి రోడ్డుపైకి అధికంగా వస్తుంది. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోవడమే నీరు నిలవడానికి కారణమని గ్రామస్తులు, వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. అపోలో స్కూల్ వద్ద నుంచి అంకాలగూడెం గ్రామం వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోయాయి. అధికారు లు ఆక్రమణలు తొలగించి డ్రెయినేజీ నిర్మిస్తే రోడ్డు ముంపునకు గురికాదని గ్రామస్తులు చెబుతున్నారు. కురిసిన భారీ వర్షానికి మండలంలో సుమారు 40 శాతం వర్షపాతం నమోదైంది. రాజవరం సమీపంలో పులివాగు, బైనేరు, కలవడంతో ఎర్రకాలువ ఉధృతి కొనసాగింది.

కుండపోత వర్షం..

ద్వారకాతిరుమల: మండలంలో సోమవారం కురిసిన కుండపోత వర్షానికి రహదారులు జలమయం అయ్యాయి. ముఖ్యంగా స్థానిక కుంకుళ్లమ్మ ఆలయ సమీపంలో, పంగిడిగూడెం వద్ద ప్రధన రహదారి కాలువగా మారింది. దాంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అలాగే శ్రీవారి దర్శనార్థం పలు ప్రాంతాల నుంచి క్షేత్రానికి విచ్చేసిన భక్తులు వర్షంలో ఇక్కట్లకు గురయ్యారు.

బీసీ కుల గణన చేపట్టాలి

ఏలూరు (టూటౌన్): జన గణనలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో బీసీ కులగణన కూడా చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో అక్టోబర్ 15 బుధవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక స్ఫూర్తి భవనంలో బీసీ కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో బీసీ కులగణన జరిగిందని తెలిపారు.

గర్భాలయ సింహద్వారం ఏర్పాటు



శ్రీసుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో గర్భాలయ సింహద్వారానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణ నేపథ్యంలో గర్భాలయ సింహద్వారం ఏర్పాటు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఉదయం 11:11 నిమిషాలకు బ్రహ్మశ్రీ అనిపెద్ది వెంకట నరసింహ శర్మ మూర్తి శాస్త్రోక్తంగా శిలా సింహద్వార గడపకి పూజలు చేశారు. దార్ల రాంబాబు దంపతుల సౌజన్యంతో గ్రానైట్ సింహద్వారం (సుమారు 60 వేల రూపాయలు) నిర్మిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తాడికొండ మురళీకృష్ణ పేర్కొన్నారు. రూ.40 లక్షల అంచనాతో మన్నే వెంకటరత్నం చౌదరి దానంగా అందజేసిన మూడున్నర సెంట్ల విస్తీర్ణంలో నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. మేకల అన్నవరం, చోడి పిండి సుబ్రహ్మణ్యం, మంచాల వెంకయ్య నాయుడు, జవ్వాది శ్రీనివాస్, మాటూరు సుధీర్, కానుమూరి వెంకన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



జంగారెడ్డిగూడెం: ఏరియా ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న శానిటరీ వర్కర్లు



చింతలపూడి: ఏరియా ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ శానిటరీ వర్కర్స్ మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీ మెడికల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం విధులు బహిష్కరించి జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు జంపన వెంకటరమణరాజు మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కాడని శానిటరీ వర్కర్లకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం వలన ఆకలితో అలమటిస్తున్నారన్నారు. శానిటరీ కార్మికులకు బకాయి వేతనాలు విడుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వేముల రాజు మేరీ, దయామని, జె.దుర్గారావు, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

చింతలపూడి: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ జీతాలు, పీఎఫ్‌లను విడుదల చేయాలని కోరుతూ సోమవారం స్థానిక ఏరియా ఆసుపత్రి ముందు పారిశుద్ధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల సంఘం ఏఐటీయూసీ అనుబంధం శాఖ అధ్యక్షురాలు తొర్లపాటి మరియమ్మ మాట్లాడుతూ గత మూడు నెలలుగా పెండింగ్ జీతాలు విడుదల చేయాలని, 15 నెలల పిఎఫ్ బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాలో రాజు, నాగరాజు, కుమారి పాల్గొన్నారు.

బీమాతో ప్రతి కుటుంబానికీ ధీమా



జంపాన భాగ్యలక్ష్మికి బీమా చెక్కును అందజేస్తున్న వైఎస్సార్ సీపీ మండల యూత్ నాయకుడు

టి.నరసాపురం: ప్రస్తుత కాలంలో ప్రతి కుటుంబానికీ బీమాతో ధీమా ఏర్పడుతుందని వైఎస్సార్ సీపీ మండల యూత్ నాయకుడు దేవరపల్లి సీతారామ ప్రసాద్ అన్నారు. టి.నరసాపురం పంచాయతీ ముత్యాలమ్మ పేటలో ఇటీవల మృతి చెందిన జంపాన శ్రీను భార్య భాగ్యలక్ష్మికి రూ.5.30 లక్షల బీమా చెక్కును సోమవారం సాయంత్రం ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా సొమ్ము బాధిత కుటుంబాలకు భవిష్యత్‌ను ఇస్తుందన్నారు. జంపాన శ్రీను ఇటీవల శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా రూ.20 వేల పాలసీ తీసుకున్నారని, పాలసీ తీసుకున్న 18 రోజుల్లోనే ప్రమాదంలో మృతిచెందారని తెలిపారు. అతని భార్య భాగ్యలక్ష్మి ఈ చెక్కును అందజేశారు. శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజీఎం కె.చిరంజీవి, బ్రాంచ్ మేనేజర్ వి.నాగార్జున, అసిస్టెంట్ మేనేజర్‌లు జాన్‌ప్రసాద్, జె.వీరబాబు, యు.కిరణ్‌బాబు, మద్దాల ప్రసాద్, గంధం వెంకటేశ్వరరావు, గుర్రాల వెంకటేశ్వరరావు, కె.దిలీప్ కుమార్, ఆ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యాన్ని నిషేధించాలి



ఆందోళనలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు

ద్వారకాతిరుమల: నకిలీ మద్యాన్ని నిషేధించాలని డిమాండ్ చేస్తూ గోపాలపురం నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు దేవరపల్లిలోని ఎక్సైజ్ స్టేషన్ వద్ద సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాజీ హోంమంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత ఎక్సైజ్ అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సరఫరా చేస్తున్న నకిలీ మద్యానికి ప్రజలు బలైపోతున్నారన్నారు. వెంటనే కల్తీ మద్యాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ద్వారకాతిరుమల మండలానికి చెందిన పార్టీ రాష్ట్ర యువజన విభాగం, మైనారిటీ సెల్ సంయుక్త కార్యదర్శులు పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, షేక్ మస్తాన్ బాషా, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు దాసరి రాంబాబు, జి.కొత్తపల్లి ఎంపీటీసీ బిరుదు గడ్డ బజారయ్య, దాసరి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా వ్యాపారులు నిబంధనలు పాటించాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో రమణ, డీఎస్పీ రవిచంద్ర

జంగారెడ్డిగూడెం: దీపావళి పండుగను జాగ్రత్తలు పాటిస్తూ ఆనందోత్సాహాలతో జరుపుకునేలా బాణసంచా దుకాణాల వద్ద భద్రతా చర్యలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.వీరమణ, డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశించారు. సోమవారం జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయంలో దీపావళి సన్నద్ధతపై డివిజన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాణసంచా దుకాణాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. బాణసంచా దుకాణాల్లో లైసెన్స్‌లో పేర్కొన్న విధంగా నిర్దేశించిన మెనూలో సామగ్రి ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కేవీ రమణ, అగ్నిమాపక శాఖ అధికారి, డివిజనల్ పరిధిలోని తహసిల్దార్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

26న మెడికల్ క్యాంపు

జంగారెడ్డిగూడెం: ప్రతి నెలా నిర్వహించే కే9 కాపు సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం తొమ్మిద్దేళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. సెక్రటరీ శీలం కృష్ణంరాజు నిర్వహణలో కె9 వ్యవస్థాపక సభ్యుడు గౌతు సత్యేంద్ర ఆఫీస్ వద్ద నిర్వహించిన సమావేశంలో పలు విభాగాల ప్రతినిధులు హాజరై సంఘ పురోగతి గురించి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన జంగారెడ్డిగూడెం రూరల్ నిమ్మలగూడెంలో మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు దాకారపు కృష్ణ, సభ్యులు, రాఘవరాజు ఆది విష్ణు, పారేపల్లి నరేష్, ట్రెజరర్ పి.మోహన్, దుట్టా శివశంకర్, ఉద్దండం ఏసుబాబు, ఆనంద ప్రసాద్, ఏసుబాబు పాల్గొన్నారు.

ఉచిత బస్సు వర్తింపజేయాలి

కుక్కునూరు: ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం విలీన మండలాల మహిళలకు వర్తించడం లేదని వారికి వర్తించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం స్థానిక నాయకులు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కలిసి సమస్యను వివరించారు. విలీన మండలాల మీదుగా భద్రాచలం వరకు నిత్యం అల్ట్రా డీలక్స్ సర్వీసులను నడుపుతుండడంతో ఉచిత బస్సు పథకం అమలు కావడం లేదని ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి గోపాలక్రిష్ణ, చల్లా కోటి, గాడిద వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్‌కు అంతర్జాతీయ పురస్కారం



సింగపూర్ సదస్సులో పురస్కారం అందుకుంటున్న లక్ష్మణ్

కొయ్యలగూడెం: కార్డియాలజీ విభాగంలో చేస్తున్న వైద్యానికి, విశిష్ట సేవలకు గాను తనకు అంతర్జాతీయ పురస్కారం లభించినట్లు కొయ్యలగూడేనికి చెందిన కార్డియాలజిస్ట్ కొల్లూరు లక్ష్మణ్ సోమవారం పేర్కొన్నారు. ఈ నెల 11, 12వ తేదీల్లో సింగపూర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో అంతర్జాతీయ కార్డియాలజిస్ట్ అశోక్సెట్, మైకేల్ కాంగ్‌ఇన్లీ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నట్టు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడంపై ఆయన హర్షం వ్యక్తం చేయగా పలువురు లక్ష్మణ్‌ను అభినందించారు.